ద్రవ్య విధానం లక్ష్యాలు-పరపతి నియంత్రణ సాధనాలు

సెక్షన్-1, యూనిట్-3

పేదరికం - నిరుద్యోగం

Q గ్రామీణ పేదరికం-నిర్మూలన చర్యలను వివరించండి?

A దేశంలో ప్రజలు ఆర్థికంగా వెనుకబడి ఉండటానికి అధిక జనాభాను ముఖ్య కారణంగా భావించవచ్చు. జనాభా వృద్ధి రేటు అధికంగా ఉన్నప్పుడు నిరక్షరాస్యత, నిరుద్యోగిత, ఆదాయ సంపదలలో వ్యత్యాసాలు ఆర్థిక వ్యవస్థలో ప్రస్ఫుటమవుతాయి. పేదరికం, నిరుద్యోగం పెరుగుదలకు పలు కారణాలు ఉన్నప్పటికీ..దేశంలో ప్రతి ఏడాది 40 మిలియన్ల మంది ప్రజలు మధ్య తరగతికి అదనంగా కలుస్తున్నారు. మార్విన్ జె.సెట్రాన్ అభిప్రాయంలో.. భారత్‌లో ప్రస్తుతం మధ్య తరగతి ప్రజల సంఖ్య 390 మిలియన్లు. వీరిలో 1/3 వంతు మంది గత 10 ఏళ్ల కాలంలో దారిద్ర్యం నుంచి విముక్తి చెందినవారే కావడం గమనార్హం. భారత్ ఇదే వృద్ధిని కొనసాగిస్తే 2025 నాటికి ఎక్కువ శాతం మంది ప్రజలు మధ్యతరగతిలో ఉంటారు. పేదరిక, నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘ కాల చర్యలు అవసరం.

దీర్ఘ కాల చర్యలు:

1960 వరకు పేద ప్రజల ఆదాయాల పెరుగుదల వ్యవసాయ రంగ విస్తరణకు దోహదపడింది. గత నాలుగు దశాబ్దాలుగా వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులకు కారణమైంది. బర్దన్ అభిప్రాయంలో వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ కారణంగా వేతన శ్రామికుల జీవన ప్రమాణం తగ్గింది. సొంతగా వ్యవసాయం చేయడాన్ని లాభదాయకంగా భావిస్తుండడంతో.. భూస్వాములు చిన్న కౌలుదార్లకు అవకాశం ఇవ్వలేదు. దాంతోపాటు వ్యవసాయాభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమవడంతో వెనుకబడిన ప్రాంతాల నుంచి ఆయా ప్రాంతాలకు శ్రామికుల వలస పెరిగింది. ఈ నేపథ్యంలో సంస్థాపరమైన మార్పులు తీసుకురాకపోతే నూతన సాంకేతిక పరిజ్ఞానం పేద ప్రజల జీవన స్థితిగతుల మెరుగుకు ఏ విధంగానూ సహాయపడదు.

పంజాబ్, హర్యానాలలో వ్యవసాయరంగంలో వాస్తవిక తలసరి ఆదాయవృద్ధి పెరిగినప్పటికీ..ఆయా రాష్ట్రాలలో పేదరిక తీవ్రత తగ్గలేదు. హరిత విప్లవం కారణంగా వ్యవసాయ రంగంలో పెరిగిన ఆదాయం కొంత మంది ధనిక రైతుల వద్దనే కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో గ్రామీణ పేద ప్రజల స్థితిగతులను మెరుగుపరచడానికి భూ సంస్కరణలు, పరపతి వంటి సంస్కరణలు ప్రధానపాత్ర వహిస్తాయి.

ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో వ్యవసాయరంగంపై ప్రభుత్వ రంగ పెట్టుబడులు తగ్గాయి. దీంతో ఈ రంగంలో వృద్ధి మందగించింది. సకాలంలో వ్యవసాయ ఉత్పాదితాలు లభ్యం కాకపోవడం, మరోవైపు ఆశించిన స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు రాకపోవడంతో కూడా వృద్ధి తగ్గింది. వ్యవసాయరంగంతోపాటు వ్యవసాయ అనుబంధాలైన పశు పెంపకం, చేపల వేటను గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్య కార్యకలాపాలుగా గుర్తించి వాటికి పరపతి విస్తరించాలి. సంస్కరణల యుగంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వృద్ధి తగ్గింది. గ్రామీణ ఉపాధి పెంచే క్రమంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి రుతు సంబంధ, ప్రచ్ఛన్న నిరుద్యోగితను నిర్మూలించవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే ఉద్దేశంతో 2006లో ప్రారంభించిన 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' లక్షిత ప్రజల ఆదాయం, ఉపాధి పెరుగుదలకు దోహదపడినప్పటికీ.. ఆ పథకం స్వల్ప కాల ప్రయోజనాలు చేకూర్చే విధంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ పేదరిక, నిరుద్యోగ నిర్మూలనకు వ్యవసాయ, అనుబంధాలను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వ రంగ పెట్టుబడులను పెంచాలి.

యూనిట్-4 సిలబస్

ద్రవ్య మార్కెట్-ద్రవ్య విధాన లక్ష్యాలు-
పరపతి నియంత్రణ-సంస్కరణల నేపథ్యంలో
బ్యాంకింగ్ రంగం-బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు

Q అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ద్రవ్య విధాన పాత్ర?

A ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో 1990లలో భారత్ ద్రవ్య విధానం పలు మార్పులను చవిచూసింది. 1980లలో ద్రవ్య పరిమాణం, వ్యయాలు, ఆర్థిక వ్యవస్థలో పరపతి ప్రవాహాన్ని నిర్దేశించే విధంగా ద్రవ్య విధానం ఉండేది. 1990లలో సంస్కరణల నేపథ్యంలో ధరల ఒడిదుడుకులకు సంబంధించి వడ్డీరేటు ప్రధాన కారకంగా ద్రవ్య విధానంలో భాగమైంది. ద్రవ్య సరఫరా నియంత్రణకు కేంద్ర బ్యాంకు అవలంబించే విధానమే ద్రవ్య విధానం. బిజినెస్ సైకిల్స్ సంభవించిన కాలంలో ఆర్థిక వ్యవస్థను సమతుల్యం చేయడానికి కేంద్ర బ్యాంకు విస్తరణ, కఠిన ద్రవ్య విధానాలను చేపడుతుంది. అప్పటి వరకు ఆర్థిక వ్యవస్థలో ఉన్న ద్రవ్య సప్లయ్‌ను మరింత పెంచడమే విస్తరణ ద్రవ్య విధానం. తిరోగమన కాలంలో వడ్డీ రేటు తగ్గించడం ద్వారా నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి సంప్రదాయంగా విస్తరణ ద్రవ్య విధానాన్ని కేంద్ర బ్యాంకు అవలంబిస్తుంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించే నేపథ్యంలో కఠిన ద్రవ్య విధానాన్ని కేంద్ర బ్యాంకు అనుసరిస్తుంది.

గరిష్ట ఆర్థికాభివృద్ధి సాధించడమనేది భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ముఖ్య లక్ష్యం. దీంతోపాటు స్వదేశంలో ధరల

స్థిరత్వం, వినిమయ రేటు స్థిరత్వం సాధించడం కూడా ఆయా దేశాల ముందున్న కర్తవ్యం. విదేశీ వినిమయ రేటులో ఒడిదుడుకులతోపాటు స్థిరంగా పెరుగుతున్న ధరలు మూలధన కల్పనకు అవరోధం కాగలవు. తద్వారా వనరుల సమర్ధ పంపిణీ జరగక గరిష్ట ఉత్పత్తి సాధనకు ఆటంకాలు ఏర్పడతాయి. మరోవైపు ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకునే చర్యలతో వనరులు ఉత్పాదక రంగాల నుంచి అనుత్పాదక రంగాలకు మరలడంతో ఆర్థికాభివృద్ధి మందగిస్తుంది. విదేశీ మారక నియంత్రణలు, దిగుమతి లైసెన్సింగ్ విధానాలు అనుత్పాదక, అంచనా వ్యాపారాలను పెంపొందిస్తాయి.

ద్రవ్యోల్బణం, అస్థిర విదేశీ మారక రేట్లను ఆర్థికాభివృద్ధిని ఆటంకపరచే ముఖ్య కారకాలుగా భావించవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉత్పత్తి, ఉద్యోగిత పెంపొందించడంలో ద్రవ్య విధానం సమర్ధత చాలా తక్కువగా ఉంది. దీనికి కారణం ఆయా దేశాల్లో అసంఘటిత రంగం ఎక్కువగా ఉండడమేకాకుండా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి ఆ రంగం లబ్ధి పొందలేకపోవడాన్ని కారణంగా పేర్కొనవచ్చు. టైమ్ లాగ్ ఎక్కువగా ఉండటం కూడా ద్రవ్య విధానాన్ని సమర్ధంగా అమలు చేయకపోవడానికి మరొక కారణం. భారత్‌లో ప్రభుత్వ కోశ విధానాలతో ఏర్పడిన ప్రతికూల ప్రభావాలను రూపుమాపే క్రమంలోనే ద్రవ్య విధానాలను అనుసరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వాలు లోటు బడ్జెట్ విధానాన్ని అవలంబిస్తుండడంతో ద్రవ్య సరఫరా పెరిగి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. అ నేపథ్యంలో సంబంధిత దేశాల కేంద్ర బ్యాంకులు నగదు నిల్వల నిష్పత్తితోపాటు ఇతర ద్రవ్య విధాన సాధనాలను వినియోగిస్తాయి. దీంతో వాణిజ్య బ్యాంకులు వివిధ రంగాలపై పెట్టే పెట్టుబడి తగ్గి వాటి లాభదాయకత తగ్గుతుంది. విస్తరణ, కఠినమైన ద్రవ్య విధానాల నేపథ్యంలో ద్రవ్య విధాన సాధనాలను కాలానుగుణంగా వినియోగిస్తేనే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వృద్ధి సాధ్యం. ద్రవ్య విధాన లక్ష్యాలను సాధించాలంటే ఆయా దేశాల్లో దీర్ఘ కాలంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు లేకుండా చూసుకోవాలి.

Q పరపతి నియంత్రణ సాధనాలను తెలపండి?

A ప్రతి దేశానికి ద్రవ్య విధానం ఒక నియంత్రణ విధానంగా ఉపయోగపడుతుంది. దేశంలో ద్రవ్య సరఫరాను నియంత్రించడం ద్వారా కేంద్ర బ్యాంకు తన ద్రవ్య విధాన లక్ష్యాలైన పూర్ణోద్యోగిత, ధరల స్థిరత్వం, ఆర్థికవృద్ధి, వ్యాపార చెల్లింపుల శేషంలో సమతుల్యం సాధించడానికి కృషి చేస్తుంది. భారతదేశ ఆర్థిక విధానానికి ద్రవ్య విధానం ఒక సాధనం కాబట్టి ఆర్థిక,ద్రవ్య విధాన లక్ష్యాలు ఒకే విధంగా ఉంటాయి. వృద్ధి, సాంఘిక న్యాయం, ధరల స్థిరత్వం ద్రవ్య విధాన లక్ష్యాలు. ద్రవ్య సరఫరా నియంత్రణ, గరిష్ట పరపతి, వడ్డీ రేటు విధానం నియంత్రణ కోసం కేంద్ర బ్యాంకు ద్రవ్య విధానాన్ని ప్రకటిస్తుంది.

పరపతి నియంత్రణకు కేంద్ర బ్యాంకు రెండు రకాల నియంత్రణ సాధనాలను ఉపయోగిస్తుంది. అవి 1. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు 2. గుణాత్మక లేక విచక్షణాత్మక పరపతి నియంత్రణ.

1.పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు: బ్యాంకు రేటు, బహిరంగ మార్కెట్ చర్యలు, నగదు నిల్వల నిష్పత్తి, స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్) -రెపోరేటు.

2.గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు: మార్జిన్ అవసరాలు, వినియోగదారుని పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్, ప్రత్యక్ష చర్య, ప్రచారం, నైతికోద్బోధ.

బహిరంగ మార్కెట్ చర్యలు అనే పరిమాణాత్మక సాధనాన్ని ద్రవ్య విధాన ప్రథమ సాధనంగా పేర్కొవచ్చు. ద్రవ్య సరఫరా నియంత్రణకు కేంద్ర బ్యాంకు బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీల అమ్మకం, కొనుగోలు వంటి చర్యలు చేపడుతుంది. తద్వారా వాణిజ్య బ్యాంకులు పరపతి సృష్టి సామర్థ్యం నియంత్రితమవుతుంది. కేంద్ర బ్యాంకు సెక్యూరిటీలను కొనుగోలు చేసినపుడు ఆయా మొత్తాన్ని చెక్కుల రూపంలో చెల్లిస్తుంది. సెక్యూరిటీల అమ్మకందార్లు చెక్కులను వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే బ్యాంకుల రిజర్వ్ పెరుగుతుంది. తద్వారా వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి పెరిగి ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమవుతాయి. అదే విధంగా కేంద్ర బ్యాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించినప్పుడు వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్ల పరిమాణం తగ్గి వాటి పరపతి సృష్టి సామర్థ్యం తగ్గుతుంది.

కేంద్ర బ్యాంకు'రిజర్వ్ అవసరాల'కు అనుగుణంగా చేపట్టే మార్పులు వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టిని నియత్రించగలవు. కేంద్ర బ్యాంకు ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా ద్రవ్య సప్లై పెంచాల్సినప్పుడు నగదు-నిల్వల నిష్పత్తిని తగ్గిస్తుంది. తద్వారా వాణిజ్య బ్యాంకుల వద్ద లభ్యమయ్యే డిపాజిట్ల పరిమాణం పెరిగి వాటి పరపతి సామర్థ్యం పెరుగుతుంది. ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడిన సమయంలో ద్రవ్యసప్లై నియంత్రణలో భాగంగా నగదు-నిల్వల నిష్పత్తి పెంచినప్పుడు వాణిజ్య బ్యాంకుల వద్ద లభ్యమయ్యే రిజర్వ్‌లు తగ్గుతాయి. అ నేపథ్యంలో వాణిజ్య బ్యాంకుల రుణ సామర్థ్యం పెరుగుతుంది. విస్తరణ, కఠిన ద్రవ్య విధానంలో భాగంగా ద్రవ్య సప్లై నియంత్రణకు కేంద్ర బ్యాంకు ఎస్ఎల్ఆర్, రెపోరేట్లను ఆర్థిక వ్యవస్థ అవసరాలకనుగుణంగా ఉపయోగిస్తుంది.

గుణాత్మక సాధనాలు:

పరపతి నియంత్రణలో భాగంగా కేంద్రబ్యాంకు అవలంబించే గుణాత్మక సాధనాలను విచక్షణాత్మక పరపతి సాధనాలుగా కూడా భావించవచ్చు. వీటి ముఖ్యోద్దేశం.. అమౌంట్, పరపతి విస్తరణకు సంబంధించిన నిబంధనలను నియంత్రించడం. అనుత్పాదక రంగాలకు పరపతి నియంత్రణలో భాగంగా ఈ సాధనాలు కేంద్ర బ్యాంకుకు ఎక్కువగా ఉపకరిస్తాయి. పరపతి రేషనింగ్, వినియోగదారుని పరపతి నియంత్రణలో భాగంగా అంచనా వ్యాపారాలకు బ్యాంకు పరపతిని పూర్తిగా నిలిపివేస్తే ధరల పెరుగుదలను అరికట్టవచ్చు. వాణిజ్య బ్యాంకులు

తమ పరిమితికి మించి కేంద్ర బ్యాంకు నుంచి రుణం పొందితే.. ఆ మొత్తంపై అపరాదపు వడ్డీని కేంద్ర బ్యాంకు విధించడం ద్వారా పరపతి నియంత్రిస్తుంది. విస్తరణ ద్రవ్య విధానాన్ని కేంద్రబ్యాంకు అవలంబించినప్పుడు గుణాత్మక పరపతి సాధనాల్లో భాగంగా మార్జిన్ అవసరాలు, వినియోగదారుని పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్ సాధనాలను ఆర్థిక వ్యవస్థ అవసరాలకనుగుణంగా రూపొందిస్తుంది.

హై పవర్డ్ మనీ: ప్రజల వద్ద ఉన్న కరెన్సీ+రిజర్వ్‌లు+కేంద్ర బ్యాంకు వద్ద ఉండే ఇతర డిపాజిట్లు

రిజర్వ్: స్టాట్యుటరీ రిజర్వ్‌లు+ఎక్సెస్ రిజర్వ్‌లు

ఎం1: ప్రజల వద్ద చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు, నాణేలు+ వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు వద్ద లభ్యమయ్యే డిమాండ్ డిపాజిట్లు+ కేంద్ర బ్యాంకు వద్ద లభ్యమయ్యే ఇతర డిపాజిట్లు

ఎం3: ఎం1+ బ్యాంకింగ్ రంగంలో లభ్యమయ్యే టైమ్ డిపాజిట్లు

గతంలో వచ్చిన ప్రశ్నలు:

- ద్రవ్య విధానం, లక్ష్యాలను వివరించండి?
- సంస్కరణల అనంతరం బ్యాంకింగ్ రంగంలో ప్రగతిని వివరించండి?

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

- ద్రవ్య విధానాల లక్ష్యాల సాధనలో కేంద్ర బ్యాంకు వైఫల్యానికి కారణాలను వివరించండి?
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ద్రవ్య విధానపాత్రను తెలపండి?
- జాతీయీకరణ తర్వాత వాణిజ్య బ్యాంకుల ప్రగతిని వివరించండి?
- పరిమాణాత్మక, విచక్షణాత్మక పరపతి నియంత్రణ విధానాన్ని తెలపండి?
- బ్యాంకింగ్ రంగంలో నరసింహం కమిటీ సిఫార్సులను పేర్కొనండి?
- నరసింహం కమిటీ సిఫార్సుల అమలు నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంలో సంభవించిన పరిణామాలను తెలపండి?
- సంస్కరణల యుగంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ప్రగతిని వివరించండి?